క్లుప్తంగా

జీతాలు చెల్లించండి

పార్వతీపురం టౌన్: పార్వతీపురం ఐటీడీఏ పరిధి, ఉమ్మడి జిల్లాలో ఉన్న గిరిజన సంక్షేమ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, సీఆర్టీలకు జీతాలు చెల్లించాలని గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షుడు పల్ల సురేష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గురుకుల విద్యాలయాలలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయ, అధ్యాపకులకు రెండు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి జీతాలు విడుదల చేయాలని కోరారు.

మెగా రక్తదాన శిబిరం


రక్త దానం చేస్తున్న దాతలు

సాలూరు: విశ్వబంధుత్వ దినోత్సవం సందర్భంగా సాలూరు పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన మెగారక్తదాన శిబిరం విజయవంతమైంది. బ్రహ్మకుమారి సమాజం యూత్ స్టేట్ కోఆర్డినేటర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 60 మంది రక్తదానం చేశారు. విజయనగరం రెడ్‌క్రాస్ సిబ్బంది దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, సేవాసంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ రోహిత్

పార్వతీపురం టౌన్: పట్టణంలోని గూడ్స్‌షెడ్ రోడ్డులో గల ఎంవైఎస్ పోలిక్లినిక్ వద్ద ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. సంతాన లేమితో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించి, స్కానింగ్‌లు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ మూడడ్ల రోహిత్ మాట్లాడుతూ.. తమ తాత గారైన మూడడ్ల ఎరుకునాయుడు జ్ఞాపకార్థం ఉచిత వైద్యశిబిరం నిర్వహించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీషారాణి, డాక్టర్ పి. సుధేష్ణదేవి పాల్గొన్నారు. అలాగే గ్యాస్ట్రిక్, జీర్ణకోశ వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్యశిబిరం ద్వారా రూ.6 వేల విలువగల లివర్ ఫైబ్రో స్కాన్ పరీక్షలను పూర్తిగా ఉచితంగా నిర్వహించారు.

ప్రారంభానికి సిద్ధంగా ప్రైమరీ అర్బన్ హెల్త్ సెంటర్

- మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర చొరవతో నిర్మాణం
- సుమారు రూ.కోటి నిధులు మంజూరు


ప్రారంభానికి సిద్ధంగా ప్రైమరీ అర్బన్ హెల్త్ సెంటర్

సాలూరు: మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ప్రత్యేక చొరవతో మంజూరై పట్టణంలోని గుమడాం సమీపంలో నిర్మాణం పూర్తి చేసుకున్న ప్రైమరీ అర్బన్ హెల్త్ సెంటర్ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైద్యానికి పెద్దపీట వేశారు. మెడికల్ కళాశాలలు, వందపడకల ఆస్పత్రులతో పాటు నాడు నేడుతో ఆస్పత్రుల ఆధునికీకరణ, నూతన భవనాల మంజూరు, ఆరోగ్య సురక్ష తదితర కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టారు.ఈ క్రమంలో మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర ప్రత్యేచ చొరవతో పట్టణంలో వందపడకల ఆస్పత్రితో పాటు గుమడాం సమీపంలో ప్రైమరీ అర్బన్ హెల్త్ సెంట ర్ మంజూరు కాగా నిర్మాణం చేపట్టారు. సుమారు రూ.80 లక్షల అంచనా వ్యయంతో ప్రైమరీ అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం చేపట్టారు. అయితే నిర్మాణం పూర్తవడానికి మరో రూ.20 లక్షలు అవసరంగా రాజన్నదొర ప్రత్యేక చొరవతో నిధులు మంజూరయ్యాయి. ఎట్టకేలకు ఈ భవనం ప్రారంభోత్సవానికి సిద్ధం కావడంతో ఈ భవనాన్ని చూస్తున్న ప్రజలు రాజన్నదొర కృషితో ఈ భవనం పూర్తయిందని ఈ నిర్మాణం కోసం రాజన్నదొర చేసిన కృషిని చర్చించుకుంటున్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టుకు భూములివ్వం

పాచిపెంట: హైడ్రో పవర్ ప్రాజెక్టుకు భూములివ్వమని మండలంలోని శతాబి ప్రాంత ప్రజాప్రతినిధులు, నాయకులు, గిరిజనులు స్పష్టం చేశారు. నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో స్థానిక గిరిజనుల ప్రమేయం లేకుండా సర్వే రాళ్లను వేయడం దుర్మార్గమని స్థానిక సర్పంచ్ శిల ్రజన్ని రామయ్య, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జన్ని రామయ్య, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కోరాడ ఈశ్వరరావులు అ న్నారు. ఈ మేరకు ఆదివారం వారు మాట్లాడుతూ గిరిజనుల భూములను స్వాధీనం చేసుకుని విద్యు త్ ఉత్పత్తి చేసే ఈ ప్రాజెక్టు ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం మానుకోవాలని డిమాండ్ చేశారు.

ఎరువు..కరువు!


పొలానికి ఎరువు వేస్తున్న రైతు(ఫైల్)

- రైతులను వేధిస్తున్న ఎరువుల కొరత
- బహిరంగ మార్కెట్‌లోనూ కరువే
- యూరియా కోసం అన్నదాతల పడిగాపులు
- ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే దుస్థితి

పాలకొండ రూరల్:

రైతులను ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలతో పాటు అడపాదడపా కురుస్తున్న వానలు అన్నదాతను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల్లోని పంటభూముల్లో వర్షపునీరు నిల్వ ఉండిపోయే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో వరి పంట పాడవ్వకుండా యూరియా ఎరువు వేయాల్సి ఉంటుంది. ఇప్పుడు క్షేత్రస్థాయిలో యూరియా ఎక్కడా లేకపోవడంతో అన్నదాతలు నరకయాతన అనుభవిస్తున్నారు. సాగు కీలక దశలో ఎరువులు లేకపోవడంతో చేను ఎరుపు రంగులోకి మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేద్దామన్నా కూడా ఎరువులు లేవని వాపోతున్నారు.

రైతుసేవా కేంద్రాల్లో నిల్!

గ్రామీణ ప్రాంతాల్లోని రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వం సరిపడ యూరియా అందుబాటులో ఉంచాలి. అయితే ఇటువంటి పరిస్థితి ఎక్కడా లేకపోవడంతో ఎరువుల కొరత స్పష్టంగా కనిపిస్తోంది. కొన్నిచోట్ల రైతుసేవా కేంద్రాల్లో అరకొరగా ఉన్న ఎరువులను కూడా నచ్చిన వారికే ఇచ్చేస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. రైతుసేవా కేంద్రాల్లో ఒక యూరియా బస్తా రూ.266ల నుంచి రూ.270కి అందిస్తే అదే యూరియా బస్తా బహిరంగ మార్కెట్‌లో రూ.500 పలుకుతోంది. దీంతో రైతులంతా యూరియా కొనుగోలుకు చేసే చెల్లింపులతో పాటు రవాణా ఖర్చు కూడా అదనంగా ఉంటోందని ఇలా అయితే వ్యవసాయం ఎలా చేయాలని రైతులు మొర్రోమంటున్నారు. అదే గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ఇలా లేదని, రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో ఉండేవని అన్నదాతలు చెబుతున్నారు.

పంట కీలకదశలో అవసరం..

ప్రస్తుతం క్షేత్రస్థాయిలో వరి సాగు అధికంగా జరుగుతోంది. ఈ పంట ఇప్పుడు కీలక దశకు చేరుకుంది. ఈ క్రమంలో పంటకు వేసేందుకు యూరియా అవసరం. యూరియా వేద్దామంటే ఎక్కడా యూరియా దొరకపోవడంతో రైతులంతా తలలు పట్టుకుంటున్నారు. కొంతమంది ప్రైవేటు వ్యాపారులైతే కృత్రిమ ఎరువుల కొరత సృష్టించి సొమ్ము చేసుకుంటున్నారని రైతులు అభిప్రాయపడుతున్నారు.

నియోజకవర్గానికి యూరియా టన్నుల్లో ఇలా..

మండలం	అవసరమైనది	పంపిణీ చేసినది	రావాల్సినది
పాలకొండ	1,479	879	600
వీరఘట్టం	924	624	300
సీతంపేట	300	50	250
భామిని	440	140	300

● 10 మందికి యూరియా దొరకడం కష్టం..



వరినాట్లు వేసిన 20 రోజుల్లోగా యూరియా వేయాలి. దీనికి తోడు ఇటీవల వానలకు నీటమునిగిన పంటను రక్షించుకునేందుకు ఎకరాకు 20 కిలోల యూరియా వేయడం అవసరం. ఇప్పుడు ఏ గ్రామంలోనూ యూరియా ఎరువు జాడ లేదు. వంద మంది రైతుల్లో 10 మందికి ఎరువులు దొరకడం కష్టంగా ఉంది. అధికారులు స్పందించి, రైతులకు అవసరమైన ఎరువు అందించాలి.

–ఆలుబిల్లి పట్టాభినాయుడు, రైతు, పాలకొండ

● కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు..



రైతుల అవసరాల మేర రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువుల పంపిణీ జరిగేలా చూస్తున్నాం. మా సిబ్బంది సూచనలతో మరికొంత ఎరువుకు ఇండెంట్ పెట్టాం. యూరియా రాగానే అందిస్తాం. పలు ఎరువుల ప్రైవేటు షాపుల్లో తనిఖీలు చేస్తున్నాం. ఎవరైనా కృత్రిమ ఎరువుల కొరతకు పాల్పడినట్లు నిర్ధారణ అయినా, అధిక ధరలకు ఎరువులు విక్రయించినట్లు తెలిసినా కఠిన చర్యలు తీసుకుంటాం.

–కె.రత్నకుమారి, వ్యవసాయ శాఖ ఏడీ, పాలకొండ

పరామర్శ


జియ్యమ్మవలస రూరల్: పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు


మాజీ మంత్రి కన్నబాబును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని రామినాయుడువలస గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు రెడ్డి శకుంతలమ్మ ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్ సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజులు ఆమె ఇంటికి ఆదివారం వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శకుంతలమ్మ మృతి పట్ల సంతాపం ప్రకటించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం అక్కడి నుంచి పెదబుడ్డిడి, గౌరమ్మపేట గ్రామాలకు వెళ్లి, అయా ప్రాంతాల్లో మృతి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలను కలిసి పరామర్శించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మూడడ్ల శశికళ, పార్టీ మండల కన్వీనర్ కోట రమేష్ నాయుడు, వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్ తదితరులు ఉన్నారు.

కురుపాం: మండలానికి చెందిన విశాలాంధ్ర విలేకరి నెల్లి శ్రీనివాసరావు తండ్రి నెల్లి సింహాచలం ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ కురుపాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాముల పుష్పశ్రీవాణి..ఆయన ఇంటికి ఆదివారం వెళ్లి పరామర్శించారు. అతడి ఆరోగ్యంపై ఆరాతీసి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆమె వెంట సర్పంచ్ సుజాత, ఎంపీపీ శెట్టి పద్మావతి, ఎంపీటీసీ సభ్యుడు బంగారునాయుడు తదితరులు ఉన్నారు.

వీరఘట్టం: వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో–ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబును మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆదివారం పరామర్శించారు. ఇటీవల మాజీ మంత్రి కన్నబాబు తండ్రి స్వర్గస్తులు కాగా ఈ మేరకు కాకినాడ వెళ్లి, ఆయనను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతకుముందు కన్నబాబు తండ్రి చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు.

అసైన్‌మెంట్ బుక్ విధానం రద్దు చేయండి

వీరఘట్టం:

బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను తప్పించాలని, పరీక్షల్లో అసైన్‌మెంట్ బుక్ విధానాన్ని రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో విలేకరులతో ఆదివారం మాట్లాడారు. ఫార్మేటివ్, సమ్మేటివ్ పరీక్షల విధానాన్ని పాత పద్ధతిలోనే నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్, యోగాంధ్ర కార్యక్రమాల్లో ఉపాధ్యాయులను పాల్గొనేలా చేసి వారిని బోధన నుంచి దూరం చేయవద్దన్నారు. అలాగే ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలన్నారు. ఒకటో తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్ పరీక్షలో వారి స్థాయికి మించి పేరాగ్రాఫ్ పరీక్షలు ఇచ్చారని తెలిపారు.


మాట్లాడుతున్న యూటీఎఫ్ నాయకులు

ప్రస్తుత విద్యా విధానంలో పరీక్షలు విద్యార్థులకా.. లేకా ఉపాధ్యాయులకా..? అనే సందేహం నెలకొందన్నారు. అసైన్‌మెంట్ మూల్యాంకన పుస్తకాలతో విద్యార్థుల కన్నా ఉపాధ్యాయులకే రాత పని ఎక్కువగా ఉందన్నారు. వారి వెంట యూటీఎఫ్ నాయకులు స్వామిబాబు, గోవిందరావు, దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

సంక్షేమ పథకాలు అందించాలి


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ

పార్వతీపురం టౌన్: భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. గౌరీశ్వర రావు, ఆర్. రాములు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన భవ న నిర్మాణ కార్మిక సంఘ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వసూలు చేస్తున్న సెస్ నిధులను కార్మికుల సంక్షే మానికి వెచ్చించడం లేదని ఆరోపించారు. ఇప్పటివరకు లక్షా 17 వేల కోట్ల రూపాయలను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేశాయని, ఇందులో సుమా రు రూ. 70 వేల కోట్లను ఇతర అవసరాలకు ప్రభుత్వాలు వినియోగించుకుని భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయన్నారు. ఎంతోమంది కార్మికులు మృతి చెందినా.. మరెంతమందో వికలాంగులుగా మారినా ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలన్నింటిపై సెప్టెంబర్ ఒకటి నుంచి ఏడో తేదీ వరకు మండలాల్లో ప్రచారం నిర్వహించి ఎనిమిదో తేదీన జిల్లా కేంద్రంలో సదస్సు నిర్వహిస్తామన్నారు.

సన్మానం


సన్మాన గ్రహీతలతో గ్రామస్తులు

పాలకొండ: మండలంలోని సింగన్నవలస గ్రామ సచివాలయంలో విధులు నిర్వహించి, ఇటీవల వేరే ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉద్యోగులను అదే సచివాలయంలో గ్రామస్తులు ఆదివారం సన్మానించారు. వెల్ఫేర్ అసిస్టెంట్ దుర్గాచంద్ర ప్రసాద్, డిజిటల్ అసిస్టెంట్ వంజరాపు రమ్యశ్రీ, మహిళా పోలీస్ అల్లు పవిత్ర, ఏఎన్ఎం కొనుసు తేజలను దుశ్శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ చేబోతుల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకోవాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ కళాధర్

వీరఘట్టం: ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి పండగ జరుపుకోవాలని ఎస్‌ఐ జి.కళాధర్ సూచించారు. మండలంలోని చిదిమి, తూడి గ్రామాల్లో ఆదివారం రాత్రి ఆయన పర్యటించి, ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ నెల 27వ తేదీన ఆరంభం కానున్న వేడుకల్లో వేడుకలు ముగిసే వరకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా చూసుకోవాలన్నారు.

రికవరీలు సరికాదు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ

పార్వతీపురం టౌన్: ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రికవరీలు చేయడం.. సస్పెన్షన్లు విధించడం సమంజసమని కాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బీవీ రమణ అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇటీవల సోషల్ ఆడిట్ పేరుతో ఫీల్డ్ అసిస్టెంట్లను వేధింపులకు గురి చేస్తున్నారని.. వేతనదారుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకపోయినా చిన్న, చిన్న సాంకేతిక కారణాలు చూపించి సస్పెండ్ చేస్తున్నారని మండిపడ్డారు. 20 సంవత్సరాలుగా ఇదే వృత్తిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించకుండా ప్రభుత్వాలు తీవ్ర అన్యా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించని ఎడల సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామన్నారు. సెప్టెంబర్ 7న పార్వతీపురంలో జరగనున్న ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా అధ్యక్షు డు మండంగి హరనాథ్, యూనియన్ కోశాధికారి పోల సింహాచలంనాయుడు, నగిరెడ్డి ఆదినారాయ ణ, పోతుల రామారావు, చల్ల సింహాచలం, ఉల్లా నాగరాజు, లాడి దుర్గారావు, లక్ష్మితులసి పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న నాయకులు

సాలూరు: గొర్రెలు, మేకల పెంపకందారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఒంగోలులో ఈ నెల 25,26 తేదీల్లో జరగనున్న రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు అచ్యుతరావు కోరారు.ఈ మేరకు ఆదివారం ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ మూగజీవాలను నిలు పుకోవడానికి స్థలాలు లేవని, కొండల మీదికి మేత కోసం వెళ్లడానికి దారుల్లో తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సంచార వాహనాల ద్వారా జీవాల మందల వద్దకు వెళ్లి వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. ఎన్‌సీడీసీ ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు. నట్టల నివారణ మందులు సంవత్సరానికి 4 సార్లు వేయాలని డిమాండ్ చేశారు.

మోసం చంద్రబాబు నైజం


రాజుగాడిగూడలో ప్రచారంలో బాబు షూ్యరిటీ-మోసం గ్యారెంటీ బ్రోచర్లు ప్రదర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో వైఎస్సార్ సీపీ నాయకులు

సీతంపేట: మోసం చేయడం చంద్రబాబు నైజమని, ప్రతి ఎన్నికలప్పుడు ప్రజలకు ఎన్నో రకాల హామీలివ్వడం అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా ఆయన మోసగించడం మనం చూస్తూనే ఉన్నామని వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హెచ్. మోహనరావు విమర్శించారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పూతికవలస పంచాయతీ, రాజుగాడిగూడ, కడగండి పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం పర్యటించిన ఆయన ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరించారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఎన్నికల హామీలన్నీ అమలు చేయకుండా ప్రజలను నయవంచన చేస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో అధికారంలోకి వచ్చిన ఏడాదికే అన్ని హామీలు అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. కుల,మత,రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాలకు మేలు చేస్తూ పథకాలు ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పుడు మాత్రం అరకొరగా అందిస్తున్న పథకాలు కూడా వారికి నచ్చిన వారికే కూటమి నాయకులు అందిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటి వరకు ఇచ్చిన గ్యాస్, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు పథకాల్లో ఎంతోమంది అర్హులకు అన్యాయం జరిగిందన్నారు.

–రెడ్‌బుక్‌తో కుట్రలు..

ఎన్నికల ప్రచార సమయంలో ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు ఇస్తానని, ఇప్పుడు ఏడాదికి మూడు సిలిండర్లు ఇస్తున్నారని, తల్లికి వందనం డబ్బులు ఒక్కొక్కరికి ఒక్కో విధంగా వేశారన్నారు. అన్నదాత సుఖీభవ పథకం చాలామంది అర్హులకు అందలేదన్నారు. ఉచిత బస్సు కూడా కొన్ని బస్సులకే పరిమితం చేసి మహిళలకు తీరని అన్యాయం చేశారన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నారు తప్ప ప్రజలకు చేసిన మంచి ఏమీ లేదన్నారు. గతంలోని వైఎస్సార్ సీపీ పాలనకు ఇప్పటి కూటమి పాలనకు ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో కూటమి మోసపూరిత పాలనకు స్వస్తి పలుకుతారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎసోని, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.మంగయ్య, పార్టీ నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ ఎస్.కాంతారావు, నాయకులు ఎస్.సాయికుమార్, ఎస్.రాము, ఎస్.కుమారి, బాపన్న, రామారావు, శాంతి, సీతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చవితి అనుమతికి సింగిల్ విండో విధానం


పాలకొండ డీఎస్పీ రాంబాబు

వీరఘట్టం: వినాయక చవితి ఉత్సవాల అనుమతులకు సంబంధించి, సింగిల్ విండో విధానం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు తెలిపారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వినాయక చవితి వేడులకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ నెల 27వ తేదీన ఉత్సవాలు ఆరంభం కానున్నందున జీఏఎన్ఈఎస్‌హెచ్‌యూటీఎస్ఏవీ.ఎన్ఈటీ వెబ్‌సైట్‌ను సంప్రదించి, అనుమతుల కోసం దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. దరఖాస్తు పెట్టుకునేందుకు ఎటువంటి రుసుం చెల్లించాల్సినవసరం లేదని, పెట్టుకున్న దరఖాస్తులు పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోకు వెళ్తుందన్నారు. అనంతరం అధికారుల పరిశీలనానంతరం అనుమతులు జారీ చేయడం జరుగుతుందన్నారు.

నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారు?

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నిమ్మక గోపాల్



గుమ్మలక్ష్మీపురం: ఎన్నికల ప్రచార సమయంలో నిరుద్యోగ యువతకు ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ ఎప్పుడు నెరవేరుస్తారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి నిమ్మక గోపాల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు చొప్పున నిరుద్యోగ భృతి అందిస్తామని చెప్పారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు కావస్తున్నా నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తుండడం తగదన్నారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పారని, ఇప్పటికే ఏడాది దాటిందని ఉద్యోగాలు నిరుద్యోగులకు ఎప్పుడిస్తారని అడిగారు. ఇప్పటికైనా కక్షపూరిత రాజకీయాలు మాని, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టిసారించాలని హితవుపలికారు.

పాఠశాల ఉన్నట్టా..లేనట్టా?


పాఠశాల వద్ద మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అనిల్, గంగారావు

కురుపాం: మండలంలోని తిత్తిరి పంచాయతీలోని టొంపలపాడు గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను పార్వతీపురం మన్యం జిల్లా ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, ఉపాధ్యక్షులు బి.అనిల్, ఎ.గంగారావులు ఆదివారం సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ పాఠశాలలో ఒక్క విద్యార్థి గానీ ఉపాధ్యాయుడు గానీ వార్డెన్ గానీ ఎవరూ లేరని, అసలు ఈ పాఠశాల ఉన్నట్టా లేనట్టా అనే సందేహం వ్యక్తం చేశారు. పాఠశాల నిర్వహణపై గ్రామస్తులను వారు ఆరాతీయగా ఈ పాఠశాలలో 3 నుంచి 8వ తరగతి వరకు ఉందని, ఇక్కడ 30 మంది విద్యార్థులు ఉంటారని తెలిపారు. అయితే ఆదివారం ఏ ఒక్కరూ పాఠశాలలో లేకపోవడం చూసిన వారు ఆశ్చర్యం వ్యక్తం చేసి, ఇలా పాఠశాలను ఎవరైనా చూస్తే అసలు పాఠశాల ఉందా లేదా అనే అనుమానం వస్తుందన్నారు. అధికారుల పర్యవేక్షణ లేకనే ఈ పాఠశాల పరిస్థితి ఇలా ఉందని, తక్షణమే అధికారులు స్పందించి, ప్రధానోపాధ్యాయుడు, వార్డెన్‌లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న మృతుడి స్నేహితులు

భామిని: మండలంలోని బాలేరు గ్రామానికి చెందిన గువ్వాడ వెంకటరమణ(38) ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఈ మేరకు అతడితో కలిసి చదువుకున్న ఎస్ఎన్ పేట 2000–01 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా కలిసి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేశారు. ఒక్కొక్కరు చందాల రూపంలో పోగు చేసిన రూ.60 వేల నగదును మృతుడి కూతురు పేరిట డిపాజిట్ చేశారు. ఆ పోస్టల్ బాండ్‌తో పాటు మరో రూ.6 వేలను ఆదివారం అందజేశారు.